

# నెల పొడుపు

**— అరిగే రామారావు**

ఆర్టీసీవారి సెమీ లగ్జరీ బస్సు హైదరాబాదు నుండి వచ్చి నూజివీడు బస్సుస్టాండులో ఆగింది.

నా చేతి సంచిని తీసికొని మెల్లిగా బస్సులోంచి కిందకు దిగాను. [illegible] పెరిగిన ఊరు.

ఉత్సుకతతో చుట్టూ కలయచూశాను. దాదాపు ముప్పైఅయిదు సంవత్సరాల తర్వాత మళ్లీ ఈ ఊరు ఇప్పుడే చూస్తున్నాను... మనస్సు ఆనందంతో ఉరకలేస్తోంది. నాముసలి గుండె పాతజ్ఞాపకాల తీయటి పాతరే అయింది. బాల్య స్మృతుల వత్తిడికి సన్నగా వణికింది. (దాదాపు అరవై సంవత్సరాల క్రితం మొదటి సారిగా ఈ ఊళ్లో కొట్టుకోవటం ఆరంభించిన ఈ గుండె ఏ ఊళ్లో ఎప్పుడు ఆగిపోతుందో!) ఆనందపు చెమ్మ లీలగా కదిలి ఆ సరికే మసకవేసిన కళ్లు మరీ మసకవేయగా పై పంచ కొసతో కళ్లొత్తుకుంటూ బయటికి నడిచేను.

రిక్షావాళ్లు చుట్టూ మూగేరు.

నూజివీడులో రిక్షాలను చూడడం క్రొత్తగా ఉంది. నా చిన్నతనంలో జట్కా బళ్లే ఉండేవి. అవి కూడా ఎన్ని? మూడో నాల్గో, అందులో రెండు బళ్లు నందమూరి గూడెం వాళ్లవి. రామయ్య లక్ష్మయ్య అని ఇద్దరన్నదమ్ములుండేవాళ్లు ఆ రెండు బళ్లూ వాళ్లవి. వాళ్ళిద్దరూ కవలలు. చూస్తానికి ఇద్దరూ ఒకేళ్ళాగా ఉండేవాళ్లు. వేసుకునే బట్టలు కూడా ఒకే మాదిరివి. ఎర్రపంచెలూ, నీరుకావి చొక్కాలూ, పట్టె వర్దనాలు పెట్టుకొని, తలగుడ్డలు కట్టుకునేవాళ్లు. అప్పటికే వాళ్లు వృద్ధులు. ఇద్దరూ కూడా కళ్లజోళ్లు పెట్టుకునే వాళ్లు. ఒకే రూపు రేఖలలో, ఒకే వేషంలో ఉండే ఆ అపూర్వ సహోదరులను చూచి నేనెప్పుడూ తికమక పడుతుండేవాడ్ని. ఒకళ్లను చూచి ఒకళ్లు అనుకునే వాణ్ణి. నా తికమక చూచి వాళ్లు నన్ను ఆటలు పట్టిస్తుండేవాళ్లు. వాళ్లని నేను 'తాత—తాత' అని పిలుస్తుండేవాణ్ణి.

వాళ్లు మాకు జట్కాలు నెలవాడిక్కి కట్టేవాళ్లు. దీర్ఘ రోగపీడితయిన మా పెద్దక్కయ్య సంధ్యా దీపం వెలిగించాక జట్కాలో ఆంజనేయస్వామి మానికి ప్రదక్షిణాలు చేసేది. ఆమెకు తోడుగా నేను వెళ్లేవాడ్ని. నూజివీడులో రెండు (దేవిడీ)దిట్టీ దర్వాజాలున్నాయి. మా ఇంటి నుంచి గుడికెళ్లాలంటే ఈ దర్వాజాల మధ్య నుంచి వెళ్లాలి. ఆ దారిలో దీపాలుండేవి కావు. చీకటి గుయ్యారంగా ఉండేది. జట్కా ఆ చీకటి దారి గుండా పోతూంటే నా గుండె పీచు పీచుమంటూ ఉండేది. చీకటికి తోడు ఆ దారంతా గండ్ర ఇసుక. ఆ ఇసుకలో జట్కా చక్రాలు మెల్లగా పోతూంటె గరగర శబ్దం వస్తుండేది. చీకట్లో వింతగా, లయబద్ధంగా వినిపించే ఆ గరగర శబ్దాన్ని వింటూ మా అక్కయ్య ఒడిలో పడుకొని నిద్రపోయేవాడ్ని...

ఇప్పుడా జట్కాబళ్లు ఏమయిపోయాయి? ఆ గుర్రాలేమయ్యాయి? ఆ ముసలి రామలక్ష్మణులు ఏమయ్యారు? ఇరవై ఏళ్ల వయస్సు నిండకుండానే నూరేళ్లు నిండిన మాఅక్కయ్య ఏ లోకానికెళ్ళి పోయింది?... గుండెల్లో సన్నని బాధ!

**డబ్బును పందెం కాస్తే అంచలంచెలుగా అదృష్టాన్నిచ్చిన జూదం అందుకు ప్రతిగా జీవితమనే 'లంచం' ఇమ్మని కోరితే?**

* రచయిత చిరునామా
C/o నర్రా రామయ్య
రావ్‌నగర్
కరీంనగర్—505 002



మాశారా, ముసలితనం వల్ల వచ్చిన చాదస్తం వల్ల అసలు కథ వదిలేసి ఏవో చెప్పబోయి, ఏదో చెప్తున్నాను!


ఒక రిక్షాలో కూలబడ్డాను. రిక్షా పోతోంది. ఈ ముప్పై సంవత్సరాల్లో ఎంతగానో మారిపోయిన మా ఊర్ని కళ్ళప్పగించి చూస్తూ కూర్చున్నా...

రిక్షా మా ఇంటి ముందుకి వచ్చి ఆగింది.

జరాభారంతో వంగిపోయిన ముసలి తల్లిలాగా దీనంగా ఉంది. మా తాత ముత్తాతల కాలం నాటి ఆ పురాతనపు ఇల్లు. గోడలు అక్కడక్కడే పెచ్చులూడిపోయి బీటలు వారాయి. పెంకులు జారిపోయాయి. అరుగులు ఒక ప్రక్క పడిపోయాయి. ఆ వీధిలో క్రొత్తగా వెలిసిన పెద్ద పెద్ద మేడలూ, బంగళాలూ మధ్యన వున్న మా పాత ఇల్లు సౌందర్య యౌవ్వనాంగనల మధ్య వృద్ధ పరిచారికలాగా దీనంగా, బేలగా, జాలిగా ఉంది. సముద్రంలోకి కృంగిపోతున్న చిల్లుపడ్డ పాత నావలాగా ఉంది. రిక్షా దిగిన నన్ను మావి మా అన్నయ్య ముందుకు వచ్చారు. మనిషి బాగా ముసలి వాడైపోయాడు. ఆయన కూడా ఒక్క గంట క్రితమే గుంటూర్నుంచి వచ్చాడంట. ఆయన్ని ఎప్పుడో ఆరేళ్ల క్రితం గుంటూర్లో ఆయన పెద్ద మనుమరాలి పెళ్లప్పుడు చూశాను.

మా పాత ఇల్లు బేరానికి వచ్చింది. ఒక చౌదరిగారు దాన్ని అమ్మమని మా ప్రాణం తీస్తున్నాడు. మా ఇల్లు రోడ్డుమీద సెంటర్లో ఉంది. ఆయన ఆ పాత ఇంటిని






పడగొట్టి ఆ స్థలంలో ఒక పెద్ద హోటల్ కట్టిస్తాడంట. అందుకే దాన్ని అమ్మమని ఊరికే మమ్మల్ని పోరుతున్నాడు. ఆయన పోరు సంగతి అటుంచి మా ఇంట్లో వాళ్లపోరు ఎక్కువైపోయింది. ఆ పాత ఇల్లు ఇంకా ఉంచుకొని ఏం చేస్తారు అమ్మేయ్యండని మా అబ్బాయిలూ, కోడళ్లూ రోజూ పోరు పెడుతున్నారు. మా అన్నయ్య కొడుకులూ, కోడళ్ళ సంగతయితే ఇహ చెప్పనక్కర్లేదు. ఆయన్ని రోజూ ఊదరగొట్టేస్తున్నారంట!... పాత ఇల్లు పనికిరాదు. పాత గడియారం పనికిరాదు. పాత రేడియో, పాత సైకిలూ, పాత కంచాలూ, పాత మంచాలూ, పాత కుర్చీలూ, పాత బల్లలూ, పాత అద్దాలూ, పాత పుస్తకాలూ— ఇవేం పనికిరావు ఈ కాలం వాళ్లకి. అంతా క్రొత్తవీ, మోడరన్‌వీ కావాలి! పాత అంతా రోత! మా ఈ పాత మనుషులు కూడా పనికిరారు! అందర్నీ కట్టకట్టి ఏ క్రిష్ణలోనో ఏ గోదాట్లోనో ముంచెయ్యండిరా బాబు!... మీ పీడ విరగడయిపోతుంది! మన్నించండి, మళ్ళీ వాదస్తం!

మా ఈ పాత ఇల్లు అమ్మేసి, ఆ రాత కోతలు పూర్తి చేయటానికి అటు గుంటూర్నుంచి మా అన్నయ్యా, ఇటు హైదరాబాదు నుంచి నేనూ వచ్చాం.

35 సం.ల తర్వాత మళ్ళీ నేను మా సొంత ఊరుకి రావటానికి ఒక పాత తరం, పాతసంస్కృతితో ముడిపడ్డ నా బాల్య స్మృతులు ఇలా వెలికి రావటానికి— నా గుండెల్లో నిక్షిప్తమైపోయి, ఎప్పుడో నా చిన్నతనంలో జరిగిన ఒక చిన్న సంఘటన అకస్మాత్తుగా మళ్లీ గుర్తుకు రావటానికి, ఈ జాలి కథగా రూపొందటానికి కారణం, మా తాతల కాలంనాటి ఆ పాతకొంపే కారణం!

మా ఇంట్లో ఎన్నాళ్లగానో అద్దెకుంటున్న కంసాలి వేంకటాచారి గారి భార్య మా అన్నదమ్ములిద్దరికీ ఆప్యాయంగా ఆతిథ్యమిచ్చింది.

ఉభయ సంధ్యలా వ్యాహ్యాళికి వెళ్లడం నాకలవాటు. హైదరాబాదులో ఉన్నట్ల యితే ఈ సమయంలో నల్లకుంటలో ఉన్న మా ఇంటి నుంచి బయలుదేరి యూనివర్సిటీ రోడ్డు వెంట ఈవినింగ్ వాక్‌కు పోయేవాడ్ని. ఆ అలవాటు కూడా అటుంచి, మా సొంత ఊర్ని అంతా మళ్లీ కలయతిరగాలనే ఉత్సాహంతో సాయంకాలపు ఎండ వాలంగానే చెప్పులు తొడుక్కుని వంటరిగా ఊళ్లోకి బయలుదేరాను.

అదే రోడ్డు—అదే బజారు. ఆ రోడ్డంట, ఆ బజారంట నేను నా చిన్నతనంలో ఎన్నిసార్లు నడిచానో! కాని అదేం దుకాణాలు, అదేం రద్దీ అదేం తొందర? హడావుడిగా, ఆదరాబాదరాగా పరుగెత్తి పరుగెత్తిఊరు తెగ రొప్పుతున్నట్లుంది. ఒకప్పుడు ఉఛ్వాశ నిశ్వాసాలను బంధించిన యోగిలాగా ప్రశాంతంగా నిశ్చలంగా నిర్మలంగా ఉండే ఊరేనా ఇది?... ఇదేం మనుషులు? ఇవేం మొగాలు? ఇదేం కృత్రిమత్వం? ఈ క్రొత్త వాళ్లంతా ఎక్కడ్నుంచి వచ్చారు? ఆ పాత వాళ్లంతా ఎక్కడికి పోయారు?... అప్పుడెప్పుడో ఆయన ఈ ఊళ్లో ఉద్యోగం చేస్తోన్న రోజుల్లో గళ్లలుంగీ మీద తెల్ల గ్లాస్కో లాల్చీ వేసుకొని, చేతిలో తోలు సంచి పట్టుకొని ఎటో చూస్తూ, ఎక్కడో ఆలోచిస్తూమూడీగా ఈరోడ్డంటా నడిచిన ఆ గుడిపాటి వేంకటచలంగారు ఇప్పుడే లోకంలో ఉన్నారు? మడత నలగని తెల్ల ఇద్దరు బట్టల్లో కమ్మగా సాగిపోయే జానపద గేయంలాగా నిండుగా ఠీవిగా ఈ రోడ్డంట నడిచిన ఆ ఎర్రోజు మాధవాచార్యులుగారు ఏ సుదూర లోకాలకు నడుచుకుంటూ వెళ్లిపోయారు? ఒకప్పుడు పుస్తకాలుచేతబట్టిరోజూ ఈ రోడ్డంట నడుస్తూ స్కూలుకెళ్ళి వెళ్ళీ చివరకు మదరాసుకెళ్ళి మాలతీచందూర్‌గా మారిపోయిన ఈ ఊరి ఆడబడుచు ఆ సి.మాలతిగారు మళ్లీ ఈ ఊరికి రారుగా? ఒకప్పటి ఈ స్కూలు స్టూడెంట్ నండూరి రామ్మోహనరావు గారు (ఆంధ్రజ్యోతి) మళ్ళీ ఈ ఊరు కెందుకొస్తారు?... ఇలా ముప్పిరిగొన్న ఆలోచనలతో, భావాల్తో నడుస్తూ...నడుస్తూ...చిన్న గాంధీ బొమ్మ మలుపు కెళ్లాను.

దార్లో చిన్న రామ మందిరం కనిపించింది. ఈ కథకు ప్రారంభం, అంతం కూడ ఈ చిన్న రామ మందిరమే!

లోపలికెళ్లాను. ఊరుమారినా, మనుషులుమారినా ఈ గుడి కానీ, ఆ రాములువారు కానీ మార్లేదు. ఈ ఊరొదిలి ఆయన ఎక్కడికీ వెళ్లలేదు. నా చిన్నతనం నుంచీ ఎలా ఉన్నారో అలాగే ఉన్నారు.

తీర్థ ప్రసాదాలు పుచ్చుకొని ఒక స్థంభానికి విశ్రాంతిగా ఆనుకొని కూర్చున్నాను.

గుడికి వచ్చిన ఒక ఆసామి నన్ను గుర్తుపట్టి పలుకరించాడు. చిన్నప్పుడు వీధి బడిలో కల్సి చదువుకున్న కోమటి స్నేహితుడు. వాడి పేరు ఏదో ఉంది. కాని ఇంటిపేరు పెట్టి 'యజ్జు—యజ్జూ' అని పిలిచే వాళ్లం. ఆ 'యజ్జు' ఇప్పుడు బాగా బొజ్జ పెంచుకున్నాడు.

ఇద్దరం కబుర్లాడుకుంటుండగా సన్నసన్నగా చీకటి పడింది.

ఎందుకో తల ఎత్తి చూచేసరికి ఆకాశంలో నెల బాలుడు కనిపిస్తున్నాడు. ఇవ్వాళ నెలపొడపా? శుక్ల పక్ష పాడ్యమా?

రేఖా మాత్రంగా కనిపిస్తోన్న ఆ నెల బాలుడ్ని చూడగానే నేను అప్రయత్నంగా కళ్లు మూసుకున్నాను. జేబులో చెయ్యి పెట్టి పర్సు బయటికి తీసి, అందులో తడిమి నేను ఎప్పుడూ నా దగ్గర ఉంచుకొనే నా ఇష్టదైవం శ్రీ ఆంజనేయస్వామి ఫోటోని బయటికి తీశాను. కళ్లు తెరిచి నా ఇష్టదైవ సుందర రూపాన్ని తిలకించి మనస్సులోనే మౌనంగా ఆయన్ని ధ్యానించాను. ఇది నేను ఎన్నో సంవత్సరాలుగా పాటిస్తోన్న ఆచారం. సదాచార పారాయణులు ఈ సనాతనాచారాన్ని పాటిస్తారు. కొందరు తమ ఇష్టమైన వారి మొగార్ని చూస్తారు. కొందరు బంగారాన్ని చూస్తారు. మరికొందరు ఏ పూల చెట్టునో, పండ్ల చెట్టునో చూస్తారు. కొందరు తమ కుడి అరచేతిని తామే చూచుకుంటారు. ఎవరిష్టం వాళ్లది. ఎవరి సెంటిమెంట్ వాళ్లది. ఎవరు ఏది చూచినా అందరూ నమ్మేది ఒక్కటే! అలా చేస్తే తమకు ఆ నెలంతా శుభదాయకం, ధన లాభంగా ఉంటుందని. ఇది మూఢాచారమని కొందరు కొట్టేయవచ్చు. అది వేరే సంగతి!

పర్సుని మళ్లీ జేబులో పెట్టుకుంటూ వుంటే నా స్మృతి పథంలో తళుక్కున ఒక మెరుపు మెరిసినట్లయింది. జ్ఞాపకాల పొరల వెనక పడిపోయిన ఒక సంఘటన ఆ క్షణంలో లీలగా గుర్తుకు వచ్చింది. మనస్సులో అస్పష్టంగా ఒక రూపం మెదిలింది.

నా వెనకాతల్నుంచి ఎవరో దగ్గినట్లనిపించింది. వెనక్కి తిరిగి చూశాను. ఎవరూ కనిపించలేదు.

ఇంతలో నా దృష్టి మేం కూర్చున్న గచ్చుపీద పడింది. యజ్జోడి ప్రక్కనుంచి ఒక చీమలబారు

సాగుతూంది.

"ఒరేయ్ ఒరేయ్ చీమల్రా! వెయ్యి తియ్యరా!" అన్నాను. వాడు కంగారుపడి ప్రక్కకి జరిగి, వెనక్కి తిరిగి చూశాడు.

"ఏరా! నీకింకా ఆ చిన్నతనం కొంటెతనంపోలేదా? చీమలంటూ హడలగొట్టావు!" అన్నాడు చిరుకోపంతో.

"నిజమేరా బాబు! అదిగో, నీ ప్రక్కన ఎన్ని చీమలున్నాయో చూడు!" అన్నాను మళ్ళీ.

"చీమలా, నీ బొందా? వున్నది కనిపించకపోతే చత్వారం. లేనివి వున్నట్లు కనిపిస్తే అది చాదస్తం. మతిమాలినతనం! వస్తా!" అంటూ లేచి తన దార్ని తాను పోయాడు.

నేల మీద అంత స్పష్టంగా చీమలబారు కనిపిస్తొంటే వీడు లేవంటాడేంటి? నాది చాదస్తమా, మతిమాలిన తనమా?...అదిగో ఇంకోబారు—మరోబారు—మరోబారు? అయ్యో, ఈ చీమలన్నీ ఎక్కడ్నుంచి వస్తోన్నాయి?

చీమలు...చీమలు...చీమలు...

మళ్ళీ నా వెనకాల ఖంగు ఖంగునా దగ్గు వినిపించింది. మెత్తగా పడుతున్న పాదాల సవ్వడి.

వెనక్కి తిరిగి చూశాను. ఎవరూ లేరు—గుడి స్తంభాల వెనుక పడుతున్న క్రీనీడ తప్ప.

మనస్సులో గజిబిజి. గుండెల్లో సన్నటి అలజడి.

స్తంభానికి నీరసంగా జారగిలబడి కళ్ళు మూసుకున్నాను.

ఇందాకా అస్పష్టంగాలలికేసినట్లుకనిపించినరూపం క్రమక్రమంగా ఒక ఆకృతిని రూపుదిద్దుకుంటూంది...

మాసిపోయిన బారు చేతుల కోరా ఖద్దరు కల్లీ లాల్చీ, మోకాళ్లను దాటుతూంది. అదే ఖద్దరు పంచె. ఆ లూజు లాల్చీ లోపల ఒక బక్క పల్చని శరీరం. ఎండిపోయి ఎముకలు బయటపడ్డ ఎదురురొమ్ము. తెల్లటి బుర్రమీసాలు. ముప్పాతిక భాగం బట్టతల. వెనుక మాత్రం బాగా పెరిగి ఉంగరాలు తిరిగిన తెల్లటి జుట్టు. చేతిలో మడతపెట్టిన న్యూస్‌పేపరు. ఖంగు ఖంగున దగ్గు. ఉబ్బసం వల్ల వచ్చిన ఆయాసం—ఇదీ వల్లభయ్య రూపం!

నూజివీడులో ఆ రోజుల్లో వల్లభయ్య అంటే తెలియని వాళ్ళు లేరు. అతనికి పిల్లా జెల్లా లేరు. ఇల్లూ వాకిలీ లేవు. పగలస్తమానం ఊరూ వాడా పట్టుకుని తిరిగేవాడు. ఏ అర్థరాత్రికో వచ్చి ఈ చిన్న రాంమందిరంలో ఒక మూల మునగదీసుకొని పడుకునేవాడు. తెల్లారి లేస్తూనే రాంమందిరం వెనుక ఉన్న దొడ్డిలోని నూతి దగ్గర కాలకృత్యాలు తీర్చుకునేవాడు. దొడ్లో పూసిన పూలు రెండు కోసి దేముడికి పెట్టి, గంట కొట్టి దణ్ణం పెట్టి మెయిల్ బస్సుకోసం బయలుదేరేవాడు. మెయిల్ బస్‌లో దినపత్రికల కట్టలు వచ్చేవి. అప్పట్లో దినపత్రికలన్నీ మదరాసు నుండే వచ్చేవి.

వల్లభయ్య 'ది మెయిల్' అనే ఇంగ్లీషు దినపత్రిక కొనేవాడు. అతనికి ఇంగ్లీషు వచ్చో రాదో, ఆ పత్రికను అతను చదివేవాడో లేదో ఎవరికీ తెలియదు. అందరికీ తెలిసిందల్లా ఒక్కటే—ఆ పత్రిక చివరి పేజీలో కుడి చేతిమూల వేసే కార్టూన్ బొమ్మను ఒక చిన్న బూతద్దం పెట్టుకొని అది దీక్షగా నిశితంగా పరీక్షించడం. అతను తొడుకున్న లాల్చీకి రెండు ప్రక్కలా వున్న జేబుల్లో నిండుగా ఏవేవో అంకెల చిట్టాలుండేవి. భూతద్దంలో పేపర్లోని ఆ బొమ్మను పదే పదే చూస్తూ, ఆ చిట్టాల్లోని అంకెలతో సరిపోలుస్తూ సీరియస్‌గా ఏవేవో లెక్కలు కట్టేవాడు.

వల్లభయ్యకు వేరే పనీపాటా లేదు. ప్రొద్దుట్నుంచి రాత్రి చీకటి పడేవరకు ఇదే పని. ఈ హోటల్లో, ఆ హోటల్లో కూర్చొని మాటిమాటికి టీలు త్రాగుతూ, చార్మినార్ సిగరెట్లు దమ్ము లాగుతూ ఆ అంకెలతో అలా కుస్తీ పట్టేవాడు. అలా కుస్తీ పట్టీ పట్టీ చీకటి పడేసరికి ఆ రోజు కాటన్ మార్కెట్ బ్రాకెట్‌లో వచ్చే వోపినింగ్—క్లోజింగ్ అంకెలను 'గెస్' చేసేవాడు. పెద్ద బజార్లో వున్న బ్రాకెట్ బ్రోకర్ దగ్గరికి వెళ్లి


ఆ అంకెల మీద పందెం కాసేవాడు. అతను కాసే పందాలన్నీ చిల్లర పందాలే—పాతికా, పరకా, మహా అయితే రూపాయి, రెండు రూపాయిలు.


ఈ ఆటలో అతనికెప్పుడూ డబ్బులు వచ్చేవి కావు. వెదురుమదురుగా అప్పుడప్పుడు వస్తుండేవేమో! ఏతావాతా అతని పరిస్థితి. షరా:—మామూలే! 'సత్రం భోజనం—మఠం నిద్ర'! భోజనం కూడా రెండు పూటలా చేసే వాడో లేదో. ఎన్ని సంవత్సరాలైనా ఎదుగూ బొదుగూ లేకుండా అలాగే ఉండేవాడు. ఎదుగుదలల్లా రోజు రోజుకి లాల్చీ జేబుల బరువును పెంచే బ్రాకెట్ అంకెల చిట్టా. రోజు రోజుకీ అతడ్ని కృంగదీసే అనారోగ్యమున్నూ! వంటిమీద మాసిపోయిన ఆ ఖద్దరు లాల్చీ పంచా, రెండు జేబుల నిండా నిండుగా ఆ అంకెల చిట్టా, బూతద్దం, చార్మినార్ సిగరెట్టు పెట్టే, మామిడి పిందెల అగ్గిపెట్టే. కాసిని చిల్లర డబ్బులూ, ఎప్పుడూ తనని వదిలిపెట్టని ఉబ్బసం రోగం—ఇవీ వల్లభయ్య స్థిరాస్థీ, చరాస్తీన్నూ!

వీటన్నింటినీ మించి ఆశ నిరాశల మధ్య పడేసి నలగ్గొట్టే టెన్షన్. రోజూ రాత్రి పన్నెండు గంటల వరకు పెద్ద బజార్లో బ్రాకెట్ బ్రోకర్ కొట్టు దగ్గర బెజవాడ నుంచి ఫోన్లో వచ్చే వోపినింగ్ క్లోజింగ్ నెంబర్ల కోసం టెన్షన్‌తో కాసుక్కూర్చునేవాడు. నెంబర్లు తెలిశాక నీరసంగా కాళ్లీడ్చుకుంటూ నిర్మానుష్యంగా ఉన్న ఆ చీకటి రోడ్డు మీద నడుచుకుంటూ—స్మశానంలోంచి ఏ దిక్కుమాలిన శవమో లేచి నడిచి వస్తోందా అన్నట్లు, దరిద్ర దేవత రాత్రి పూట బిచ్చానికి బయలుదేరిందా అన్నట్లు, మిగతా అంకెలన్నీ వెళ్లగొట్టితే వంటికట్టై వంటరి వకటంకె దిక్కు తోచక వీధులంట బడ్డదా అన్నట్లు—ఖంగు ఖంగున దగ్గుతూ రొప్పుతూ రోస్తూ చిన్న రాంమందిరంకు తిరిగి వచ్చి పై పంచ క్రింద పరచుకుని పడుకునేవాడు.

వల్లభయ్య పరమ ఆస్తికుడు. దైవభక్తీ, అదృష్టంమీద గురీ వున్నవాడు. ఎవరైనా దేముడు లేడంటే వాళ్లను నిలబెట్టి, 'ప్రతి నా కొడుక్కీ దేముడు లేడంటం ఫ్యాషనయిపోయింది! దేముడు లేకపోతే నా కొడకల్లారా మీరెట్టా పుట్టార్రా?' అని పచ్చి బూతులు తిట్టేవాడు. దేముడున్నాడని చెప్పటానికి పచ్చి పచ్చిగా, మోటుగా ఎన్నో నిదర్శనాలూ ఉటంకించేవాడు. వల్లభయ్య అలాగే గాంధీయ వాది. కాంగ్రెసు అభిమాని. గాంధీ గారి సిద్ధాంతాల మీద గంటలకొద్దీ మాట్లాడేవాడు. కమ్యూనిస్టుల మీద దుమ్మెత్తి పోసేవాడు.

ఇలా, 'మెయిల్' పేపరు కార్టూన్ బొమ్మల్లో బూతద్దం పెట్టి తన అదృష్టాన్ని వెతుక్కునే వల్లభయ్య అదృష్టాన్ని నేను మార్చేశాను. అప్పటికి నా వయస్సు పదో పన్నెండేళ్లో. అంత చిన్న వయస్సులో అరవై ఏళ్ల



## గిరీశం డిక్షనరీ!

రైళ్లు :సమయంవిలువ తెలిపే అరాచక యంత్రం.

సముద్రం :ఆకలిమంటల్నీ కడుపుమంటల్నీ ఆర్పడానికి పనికివచ్చే రిజర్వాయర్

భూమి :ఒకప్పటి ప్రకృతి, వికృతిగా మారి గుండ్రంగా సంచరించేది.

మాటలు :గురి అక్కరలేని ఈటెలు

కవిత :పెద్ద కేన్వాస్

ప్రేమ :ఈస్ట్‌మన్‌కలర్ భ్రమకి నిజంలాంటి ఆశయపు పట్టకం

సత్యం :మానససరోవరంలో ఆడుకునే హంస

ప్రకృతి :మనిషి ఎంత అసహజంగా వుంటాడో చూపే అద్దం.

జైలు :మనస్సులాంటి మరోగది— బాధలుండేది.

స్వప్నం :అసమర్థుడి నిజం

సమర్థుడు :వేదాంతిలావచ్చే పొలిటికల్ సైంటిస్ట్.

డెంటిస్ట్ :పండిన పళ్లని రాల్చేవాడు మాత్రమే— ఫ్రూట్ గేదరర్.

విమర్శ :అవమానించడానికి సుకుమారమైన పేరు

వ్యాఖ్య :నిజభ్రమ

భ్రమ :ప్లాస్టిక్ పువ్వు.

—శివాజీ

ఆ వృద్ధుడి అదృష్టాన్ని నేను మార్చటమేమిటి? ఆశ్చర్యంగా ఉంది కదూ! కాని, జరిగిందదే! ఆ అదృష్టమే అతనికి ఘోరాతి ఘోరమైన విపత్తును తెచ్చిపెట్టింది. అప్పటి నా పసిగుండెల్లో విషాదాన్ని పలికించి, చేదు జ్ఞాపకం లీలగా, ఇన్ని సంవత్సరాలకు ఇప్పుడు మళ్లీ గుండెల్లో మెదిలి, నా గుండెల్ని బరువెక్కించాయి!

ఒక రోజు మా ఇంట్లో మా అమ్మ అన్నంవండలేదు. బియ్యం లేవో, మా నాన్న కొట్టితే వండలేదో నాకిప్పుడు గుర్తులేదు. మా అమ్మ నాకు కాసిని చిల్లర డబ్బులు ఇచ్చి హోటల్లో ఏదైనా తిని రమ్మంది. నేను హోటల్‌కు వెళ్లటం అదే మొదటి సారి. బెరుకు బెరుగ్గా లోపలికి వెళ్ళి బెంచీమీద కూర్చున్నాను. మాటిమాటికి గుప్పిట్లో ఉన్న డబ్బుల వంక చూసుకుంటూ పెసరట్టు చెప్పాను. కాసేపటికి పెసరట్టుతో పాటు హల్వా కూడా తీసికొచ్చి నా ముందు పెట్టాడు సర్వరు. నేను బిత్తరపోయాను. నేను హల్వా చెప్పలేదు. మరెందుకు తెచ్చినట్లు. మరింకెవరన్నా ఆర్డరిచ్చింది నాకు తీసికొచ్చిపెట్టాడా? ఇదెవరకీ. అని అన్నా. నీకే తీసుకో అన్నాడు. నా దగ్గరన్ని డబ్బుల్లేవన్నా: 'ఆయన ఇప్పించారు తిను!' అన్నాడు ఆ సర్వర్. అప్పుడు తలెత్తి చూశా. హోటల్లో ఒక మూల కూర్చొని బూతద్దంలో పేపర్ను చూస్తోన్న వల్లభయ్య కనిపించాడు.

తెల్లటి పండు మీసాల వెనుక నిండుగా నవ్వి "తిను రాంబాబు!" అన్నాడు.

నాకు సిగ్గేసింది. తినకుండా తలవంచుకొని కూర్చున్నాను. అతను అప్పుడు లేచి వచ్చి, నా ప్రక్కన కూర్చొని ఆప్యాయంగా నా బుగ్గలు నిమురుతూ, "తినవయ్యా నాయనా! మొన్న నెలపొడుపు రోజున అనుకోకుండా బజార్లో నీ మొగం చూశా! మన సుడి తిరిగింది. అంకెలన్నీ అనుకున్నట్లే వస్తున్నాయి!" అన్నాడు.

ప్రక్కనున్న వాళ్ళతో, "ఈ కుర్రాడిది బలే అదృష్టమైన మొగం! ఈ నెలంతా మనకి లక్కీగా ఉంది. ఆడిన ప్రతి నెంబరూ వస్తోంది!" అన్నాడు హుషారుగా.

ఆ నెంబరేంటో, డబ్బులు రావటమేంటో నాకప్పుడు తెలియలేదు. తర్వాత్తర్వాత తెలిసింది. అప్పట్నుంచి నేను బజార్లో కనిపించినప్పుడల్లా, 'రాంబాబు ఎక్కడికెళ్లుతున్నావు?' అని నవ్వుతూ పలకరించేవాడు. నా ఎర్రటి బుగ్గలు పిండేవాడు. వద్దన్నకొద్దీ వినకుండా జేబులో చిల్లర డబ్బులు వేసేవాడు. ఇలా పదిహేనూ ఇరవై రోజులు గడిచాయి.

ఒకరోజు వల్లభయ్య మా ఇంటికి వచ్చి బయట నిలబడి నాకోసం కబురు పంపాడు. నేను ఎవరా అని బయటికి వచ్చాను. మనిషి మంచి హుషారుగా ఉన్నాడు. క్రాఫింగ్ చేయించుకొని గడ్డం నున్నగా కొరిగించుకొని, మీసాలను ట్రిమ్ చేయించుకున్నాడు. క్రొత్త బట్టలు కుట్టించుకున్నట్లున్నాడు. కడుపు నిండిన వాడులాగా, కరువు తీరిన వాడులాగా మనిషి నిండుగా ఉన్నాడు.

"రాంబాబు, రేపు నీవు సినిమాకి గినిమాకి ఎక్కడికీ వెళ్ళవుకదా! రేపే నెలపొడుపు. సాయంత్రమే వచ్చి మీ అరుగు మీద కూర్చుంటాను. ఈ నెల కూడా నీ మొగమే చూస్తా. ఈ దెబ్బతో నా దరిద్రం తీరిపోతుంది! ఇంట్లోనే ఉంటావుగా!" అని నా చేతిలో మిఠాయి పొట్లం పెట్టి హడావుడిగా హుషారుగా వెళ్లిపోయాడు.

మా అమ్మ—'ఆయన నీకోసం ఎందుకొచ్చాడురా?'

చెప్పాను. 'బాగానే వుంది!' అని ఆశ్చర్యంగా బుగ్గమీద చెయ్యి వేసుకుంది.

ముందుగా చెప్పినట్లే మర్నాడు సాయంత్రమే వచ్చి మా ఇంటికి ఎదురుగా ఉన్న చెట్టి వెంకటేశ్వర్రావు మిషన్ కొట్టులో కూర్చున్నాడు. ఇంట్లోకి పిల్చినా రాలేదు, తెల్లగా తీసికొని రావటానికి, బజారుకెళ్ళటానికి నేను బయటికి వచ్చినప్పుడల్లా మాటి మాటికి, 'రాంబాబు, ఎక్కడికీ వెళ్ళమాకు. తొందరగా వచ్చేయ్!' అని హెచ్చరించటం మొదలు పెట్టాడు. అంత పెద్దమనిషి నెలపొడుపు రోజున ప్రత్యేకంగా నా మొగం చూడటానికి మా ఇంటి ముందు అలా కాసుకొని కూర్చోవటం నాకెంతో గర్వమనిపించింది.

మొత్తానికి ఆ సాయంత్రమంతా నన్ను ఎక్కడికీ కదల్నీయలేదు. చీకటి పడ్డాక నన్ను ప్రక్కన పెట్టుకొని ఆకాశంలో నెలబాలుడ్ని చూసి, మళ్ళీ నా మొగం చూసి నవ్వుతూ నా భుజం తట్టి, చేతిలో బలవంతంగా మిఠాయి పొట్లం పెట్టి హుషారుగా వెళ్లిపోయాడు.

ఆ తర్వాత, రోజూ హుషారుగా బజార్లో కనిపించేవాడు. నన్ను చూడగానే నవ్వుల్ని కొట్టి పిల్చి, 'రాంబాబూ! ఎక్కడికి వెళ్లుతున్నావు?' అని నవ్వుతూ పలకరించి నా బుగ్గలు నలిపేసేవాడు. అప్పట్లో నేను ఎర్రగా, ఇంతింత బుగ్గలతో ముద్దొస్తూ ఉండేవాణ్ణి. అదే కాకుండా, నా మూలంగా అతని 'సుడి' తిరిగిందనే అతని నమ్మకం ఒకటి! ఆ విధంగా అరవై ఏళ్ల ఆ పెద్ద మనిషికీ, పదేళ్ళ నాకూ ఒక విధమైన స్నేహమేర్పడింది!

ఇలా ఒక వారం గడిచింది.

ఆ రోజు ఉదయం ఆరుగంటలకు పుస్తకాలు తీసికొని ప్రైవేటుకని బయలుదేరాను.

చిన్న రాంమందిరం దగ్గర జనం మూగి ఉన్నారు. అందరూ నోళ్ళు నొక్కుకుంటూ వింతగా చెప్పుకుంటున్నారు. కొందరు రాంమందిరం గేట్లో నిలబడి లోపలికి ఎగబడి చూస్తున్నారు. లోపల ఏముందో నాకర్థం కాలేదు. నేనూ ఆ జనం లోంచి దూరబడి ముందుకెళ్ళి చూశాను. బాగా దగ్గరగా చూశాను. వల్లభయ్య చచ్చి పడి ఉన్నాడు.

అతని మొగం వికృతంగా, భయంకరంగా ఉంది. చివరి క్షణాల్లో అతని ఆత్మ అతని నాలిక మీద నుంచి వదులుకుంటూ పోయిందా అన్నట్లు నాలికంతా బయటికి పెళ్ళుకొచ్చి వికృతంగా ఉంది.

ప్రాణం పొయ్యేముందు అతను బాధతో గిలగిలా కొట్టుకున్నాడన్నందుకు దాఖలాగా గుప్పిళ్లు మూసివున్నాయి. (మూసిన అరచేతుల్లో నా కోసం మిఠాయి పొట్లాలు పట్టుకొని ఉన్నాడా? నా భుజం మీద తట్టి, నా లేత బుగ్గల్ని ప్రేమగా నిమిరిన ఆ చేతులు కొంకర్లు పోయి మెలికలు తిరిగి నిర్జీవంగా పడి ఉన్నాయి! ఏవరి దశలో ఈతనికి పక్షవాతం గాని వచ్చిందా?)

కాళ్ళు విడంగా చాచి ఉన్నాయి. చాచి ఉన్న ఆ కాళ్ళ మధ్యలోకి ఎర్ర చీమల బారు పోతూంది... ఒకటి కాదు, రెండు కాదు.... ఎన్నో బార్లు... ఎన్నెన్నో చీమలు...చీమలు...చీమలు...

'మెషగాల మీద కాల్చేసి, తొక్కేసి చంపేశారు!' అని ఎవరో అంటున్నమాట నా చెవుల్లో పడింది!

వల్లభయ్యది సహజమైన చావు కాదు. ఎవరో చంపేశారు. హత్య చేశారు. బలవంతంగా ఘోరాతి

...ఆవరణంగా, నిశాతిమితంగా, ప్రశాంతంగా ఉన్న... ఘటనతో నా మనస్సు జలదరించింది.

...నేనా గుంపులోంచి తప్పించుకొని బయటికి వచ్చి ...తో పరిగెత్తుతున్నాను...

...పరుగు, పరుగు! ఒకటే పరుగు...

ఎక్కడికా...కాదు. మా ఇంటికా...కాదు. ఎక్కడికో పరిగెత్తుతున్నాను. ఎందుకో పరుగెత్తుతున్నాను. ...పరుగు...పరుగు...పరుగు...

అలా పరుగెత్తి, పరుగెత్తి ఒకచోట ఆగిపోయాను. ...చూశాను. అది ఊరి బయట ఉన్న ...చెరువు...

చెరువు గట్టుమీద ఒక చెట్టు క్రింద రాయి మీద కూలబడ్డాను. ఆయాసంతో ఊపిరి ...తున్నాను.

చెరువులోని నీళ్ళమీదకు కాని, గాలికి ఊగుతున్న కొమ్మల్లోంచి ఆ ఉదయపు సూర్యుడు ఎర్రగా, మెడ ...ఎవరో గొంతు పిసికి చంపుతూంటె ...గింగిరా కొట్టుకుంటున్నట్లుగా ఉన్నాడు.

ఎర్రగా ఉన్న నీళ్ళతో ఆ చెరువు నెత్తురు చెరువులాగా ఉంది. చెట్టుకొమ్మ మీద కూర్చొని ఒక నల్లటిజెముడి కాకి ఊరికే గొంతు చించుకొని అరుస్తోంది.

వల్లభయ్య నవ్వులాగా చెట్టు క్రింద చల్లగా ఉంది. క్రింద పచ్చిపడి ఉన్న ఒక తొండ కనిపించింది. దాన్ని చీమలు కట్టి ఉన్నాయి. ఆ ప్రక్కనే చిలకలు కొట్టి పండి క్రిందరాలిన మామిడికాయ వుంది. దానికి కూడ చీమలు పట్టాయి. మనిషి శవాన్ని కూడ చీమలే పట్టు తాయి. మిఠాయిని కూడ చీమలే పట్టుతాయి. దేముడి ముందు పెట్టిన బెల్లం గడ్డను కూడ చీమలే పట్టు తాయి. ఎక్కడయినా, ఎవరిదగ్గరయినా వాటికి కావ ల్సింది ఆహారమే! ఆ ఆహారంకోసం వచ్చినతొండనూ, పండిన పండునూ, వచ్చిన శవాన్ని, దేముడికి పెట్టిన నైవేద్యాన్ని అవి పట్టుతాయి! అలాగే ఈ మనిషికి కావ ల్సింది డబ్బు! ఆ డబ్బు కోసం ఏదైనా చేస్తాడు! ఆ డబ్బు కష్టపడే కూలోడ్డే అయినా, వళ్లమ్ముకునే సాని దాన్దే అయినా స్వాములోర్దే అయినా, సగటు సంసారిదే అయినా, దేముడిదే అయినా, ప్రజలదే అయినా, ప్రభుత్వానిదే అయినా, వీధుల్లో బిచ్చమెత్తుకునే బిచ్చ దాన్దే అయినా ఆఖరికీ ఎవ్వరికీ, ఎప్పుడూ అపకారం తలపెట్టని వల్లభయ్యదే అయినా ఫర్లేదు. వాళ్ళకి కావ ల్సిందల్లా డబ్బూ...డబ్బూ...డబ్బూ!

అది అంకెల గారడీయో, గాలి వాటమో, అతను నమ్మినట్లు నెలపొడుపు రోజున నా మొగం మూస్తం వల్ల పట్టిన అదృష్టమో మొత్తానికి ఏదైతేనేం ఈ నెలా నెలా పదిరోజుల్నుంచి వల్లభయ్య బ్రాకెట్ ఆటలో దాదాపు రోజూ డబ్బులు గెల్చుకుంటున్నాడంట. అం తకుముందు బేడా, పావలా కాసేవాడు ఇప్పుడు చేతిలో డబ్బులాడుతుండేసరికి ఎక్కువ మొత్తాల్లో కాస్తున్నా డంట. అతడ్ని చూచి మిగతా చిల్లర ఆటగాళ్లే కాకుండా, పెద్ద ఆటగాళ్ళు కూడా అతడు కాసిన నెంబర్లమీదే కాస్తున్నారంట. ఈ విధంగ స్థానికంగా ఉన్న బ్రాకెట్ కంపెనీ వాళ్ళు రోజూ చాలా నష్టపోతు న్నారంట. ...వల్లభయ్య ...లో గెల్చుకున్నాడంట. ఆ ...మంటతో బ్రాకెట్ కంపెనీ మనుషులు రాత్రి ...గంటలప్పుడు చిన్న రామమందిరంకు వచ్చి నిశ్చింతగా, హాయిగా నిద్రపోతున్న వల్లభయ్య గొంతుల్లో ...కుక్కి, గొంతు పిసికి, కాళ్లతో త్రొక్కి ప్రాణాలు విడిపేసి చంపి, దగ్గరున్న డబ్బులు కాస్తా తీసికొని పారిపోయారంట!

ఆ విధంగా, పాపం వల్లభయ్య జీవితం పరిసమాప్త మైపోయింది. నెలపొడుపు రోజున నా మొగం చూడ టం వల్ల అతనికి పట్టిన అదృష్టం(?) చివరికి అతని చావుకు దారితీసింది?

ఈ విషాద గాథ ఇన్ని సంవత్సరాలకు మళ్ళీ ఇప్పుడు నేను ఈ చిన్న రామమందిరంలో కూర్చొని, అదిగో పైన ఆకాశంలో ఆ నెలబాలుడ్ని చూశాక గుర్తుకొ చ్చింది.

ఆ నెల బాలుడికి కూడ ఈ జాలి కథ మళ్లీ గుర్తుకు వచ్చినట్లుంది. అదిగో మొగం జాలిగా పెట్టి, బరువెక్కిన గుండెలతో భారంగా నిట్టూర్చి, కన్నీరు పెట్టి, ఆకాశపు చీకట్లోకి మెల్లమెల్లగా కలిగిపోతున్నా డు...

నేను కూర్చున్న వెనకనుంచి మళ్ళీ దగ్గు వినిపిం చింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాను.

నిటారుగా నిర్వేదనంగా, ఈ విషాదగాథకు సాక్షీ భూతాలుగా నిలబడ్డ గుడి స్తంభాలు! *